క్లుప్తంగా

పాఠశాల తలుపులకు నిప్పు



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడలకు సంబంధించిన గది తలుపులకు సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. దీంతో మంటలు చెలరేగడంతో రోడ్డుపై వెళ్తున్న కొందరు గమనించి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందికి సమాచారం ఇవ్వగా వెంటనే వారు పాఠశాల వద్దకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. మంగళవారం ఉదయం పాఠశాల ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. తలుపులు కాలిపోయాయని, లోపల ఉన్న సామగ్రికి ఏం కాలేదని చెప్పారు. విచారణ చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

అంబులెన్స్‌లో ప్రసవం: తల్లీబిడ్డ క్షేమం



వనపర్తి రూరల్: శ్రీరంగాపూర్ మండలంలోని నాగరాలకు చెందిన గర్భిణి లక్ష్మికి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే వనపర్తి మండలంలోని కడుకుంట్ల ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ ఇంటికి వచ్చేలోపు లక్ష్మికి నొప్పులు ఎక్కువ కావడంతో వెంటనే స్పందించిన సిబ్బంది ఈఎంటీ నరేందర్, పైలట్ రాఘవేంద్ర అంబులెన్స్‌లోనే మహిళకు సాధారణ కాన్పు చేయగా.. మగబిడ్డకు జన్మించాడు. అంబులెన్స్ సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తల్లి, బిడ్డను వనపర్తి ఎంసీహెచ్ ఆస్పత్రిలో చేర్పించినట్లు సిబ్బంది తెలిపారు.

ఎమ్మెల్యేకు పరామర్శ



ఆత్మకూర్: దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి మృతి చెందడంతో ధమగ్నాపూర్‌లో ఐఎన్‌టీయూసీ నాయకులు ఎమ్మెల్యేను పరామర్శించారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి సానుభూతి తెలిపారు. అనంతరం కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోరింగ్‌శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ఆత్మకూర్, అమరచింత, మదనాపురం నాయకులు కృష్ణదాస్, జమాల్, ప్రభుదాస్, సారన్న, సోమ్లానాయక్, ఫయాజ్. సుభాష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తండ్రి జి.కృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందారు. మంగళవారం రాయిణిపేట గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆయన స్వగ్రామమైన చిన్నచింతకుంట మండలం ధమగ్నాపూర్‌కు వెళ్లి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే తండ్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, పాండురంగయ్య, భాస్కర్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి..



వనపర్తి రూరల్: మండలంలోని చిమనగుంటపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మంగళవారం స్థానిక నాయకులతో కలిసి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ రైతు కమిటీ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డిని, వారి కుంటుంబ సభ్యులను పరామర్శించిచారు. వారి వెంట వాకిటి శ్రీధర్, సింగిల్ విండో అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, మాధవరెడ్డి, నరేష్, నరసింహ, రాము తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి రూ.40 వేల ఆర్థికసాయం

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలోని చెలిమిల్లకు చెందిన బీసన్నకు ప్రమాదవశాత్తు రెండు కాళ్లు విరిగి వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తోటి స్నేహితులతో విషయం తెలుసుకున్న పెబ్బేరు పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 2003–04 సంవత్సరం 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అందరూ కలిసి రూ.40 వేల ఆర్థికసాయాన్ని మంగళవారం వనపర్తి ఆస్పత్రిలో బాధితుడికి అందజేశారు.



ఐలమ్మ స్ఫూర్తితో అడుగేద్దాం

సాక్షి, నెట్‌వర్క్: వీర వనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తితో నేటితరం యువకులు లక్ష్య సాధనలో ముందుకు సాగాలని రజక సంఘం, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన ధీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్రహంలింకన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్, బాల్యనాయక్, కోరి శ్రీనివాస్, వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పీజే బాబు, బోయేజ్, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సంద వెంకటేష్, మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్ మండలం కేతేపల్లిలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



వనపర్తి పట్టణంలో..



మదనాపురంలో..



కొత్తకోటలో..

చింతకుంటలో రక్తనమూనాల సేకరణ



చింతకుంటలో రక్తనమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది



అమరచింతలో..

పాన్‌గల్: మండలంలోని చింతకుంటలో పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం రక్త నమూనాలను సేకరించారు. గ్రామంలో ఠాగూర్ అనే బాలుడికి డెంగీ పాజిటివ్ రావడంతో బాలుడి కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులతో పాటు ఇంటి పరిసరాల్లోని పలు గృహాల వారి నుంచి నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు డాక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, నిల్వ నీటిని వారానికి ఒక్కసారి పారబోసి నూతన నీటిని పట్టుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఉమాదేవి, ఎంపీడీఓ గోవింద్‌రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమరచింత: వర్షాకాలంలో వ్యాప్తి చెందే విషజ్వరాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ రూపశ్రీ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని కొత్తతండాలో మంగళవారం వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు తండావాసులతో డాక్టర్ రూపశ్రీ మాట్లాడుతూ చిన్నపాటి జ్వరం, దగ్గు, జలుబు లాంటి లక్షణాలు ఉంటే వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ప్రత్యేక అధికారి డాక్టర్ లక్ష్మప్ప తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

వనపర్తి రూరల్: ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) భారత జాతీయ పట్టణ కన్వీనర్ జయమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని శ్వేతానగర్‌లో పట్టణ కమిటీ సమావేశాన్ని కో–కన్వీనర్ భూమిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు జరిగి పదినెలలు కావస్తున్నా.. మహిళలకు ఫ్రీ బస్సు హామీ తప్ప మిగతా హామీలు ఏ ఒక్కటి అమలు కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళావతమ్మ, ప్రవళిక, జయశ్రీ, శిరీష, సునీత పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మదనాపురం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా సాధికారత కేంద్రం, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ జెండర్ స్పెషలిస్ట్ శ్రీవాణి సూచించారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మట్లాడుతూ గర్భ నిర్ధారణ పరీక్షలు చేయించడం చట్టరీత్యా నేరమని, ప్రోత్సహించే వారిపై కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ప్రభుత్వాలు మహిళలకు అన్ని విధాలుగా రక్షణ ఉంటాయన్నారు. సమాజంలో మహిళలు వేధింపులకు గురయితే వెంటనే పోలీసులకు ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ భవాని, డాక్టర్ సలోమి, సుమ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



కొత్తకోట రూరల్: డప్పు దరువుల మధ్య తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా మంగళవారం పోచమ్మకు బోనాల సమర్పణ వైభవంగా జరిగాయి. మండలంలోని పామాపురంలో మహిళలు, చిన్నారులు బోనాలతో పోచమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పంటలు బాగా పండాలంటూ ప్రజలు కోళ్లు, పొటేళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆరోగ్యం మన చేతుల్లోనే..

ఆత్మకూర్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. కలెక్టరు ఆదర్శ్‌సురభి ఆదేశాల మేరకు మంగళవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాలతో పాటు ఆత్మకూర్ పట్టణంలోని 2వ వార్డులో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు.

పాన్‌గల్: పరిసరాల శుభ్రతతోనే రోగాలకు దూరంగా ఉండవచ్చని వైద్య సిబ్బంది, అధికారులు పేర్కొన్నారు. డ్రైడేలో భాగంగా మంగళవారం మండలంలోని అన్నారం, చింతకుంట గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య నివారణ చర్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిల్వ నీరు, దోమల వృద్ధితోనే రోగాలు సంభవిస్తున్నాయన్నారు. దోమలు వృద్ధి చెందకుండా కాలనీల్లో నిల్వ నీటిని పారబోయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఉమాదేవి, ఎంపీడీఓ గోవింద్‌రావు, పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటామని, పరిసరాల శుభ్రత కోసం మున్సిపాలిటీకి ప్రజలు సహకరించాలని మున్సిపల్ ప్రత్యేక అధికారి మత్స్యశాఖ ఏడీ లక్ష్మప్ప, చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని రెండో వార్డు కొత్తతండాలో పర్యటించి ఏపుగా పెరుగుతున్న గడ్డి పొదలను తొలగించి, తాగునీటి ట్యాంకు వద్ద పరిసరాలను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు. రహదారిపై నిలిచిన వర్షపు నీటిని మళ్లించడం వంటి పనులు మున్సిపల్ కార్మికులతో చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం, ఆరోగ్య శాఖ సిబ్బంది, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



అమరచింతలో..



పాన్‌గల్ మండలం అన్నారంలో..

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఖిల్లాఘనపురం: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మోకాళ్లపై కూర్చొని నిరసన చేపట్టారు. కార్యక్రమానికి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వం ఏడు నెలలుగా కార్మికుల వేతనాలు విడుదల చేయలేదన్నారు. దీంతో ఏజెన్సీ కాంట్రాక్టర్లు కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. కార్యక్రమంలో ఆస్పత్రి కార్మికులు సాయికృష్ణ, భీమయ్య, భాస్కర్, మునీందర్, పద్మ, భాగ్యమ్మ, స్వాతి, నగ్మాబేగం, సంగీత, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు..

వనపర్తి రూరల్: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు సకాలంలో అందించాలని వనపర్తి జిల్లా ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు వీరపాగ రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అశోక్, బలరాం, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు నష్టం

అమరచింత: వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ పట్టణ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపి, తమ మొబైల్ ఫోన్‌లో ఎస్‌ఎంఎస్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిం మైనార్టీలకు నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు తౌఫిక్, నిసార్, షంషీర్, ఆషూ, పాషా, ఖాసీం, మొయిన్, దస్తగీర్, నజీర్, మైనద్దీన్, అల్తాఫ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

ఆత్మకూర్: ప్రైవేట్ ఫైనాన్స్‌లో చేసిన అప్పుల కారణంగా ఓవ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని మేడేపల్లికి చెందిన శ్రీనివాసులు (46) ఈ నెల 6న కనిపించకుండా పోయాడని భార్య మణెమ్మ మంగళవారం ఆత్మకూర్ పోలీసులను ఆశ్రయించింది. వనపర్తిలోని ఫిన్‌కేర్ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో తన భర్త అప్పు చేశాడని వారి వేధింపులతో పాటు, బయట అప్పుల నుంచి ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొంది. తన కుమారుడిని వదిలి పెడతానని రైల్వేస్టేషన్‌కు బైకుపై వెళ్లి నేటి వరకు తిరిగి రాలేదని, ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని, తెలిసిన వాళ్ల వద్ద ఆరాతీసిన ఆచూకీ లభించడం లేదన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

లంభోదరా.. పాహిమాం

వనపర్తిటౌన్: ఆర్టీసీ డిపోలో ప్రతిష్ఠించిన గణనాథుడికి మంగళవారం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ వేణుగోపాల్ అధికారులు, ఉద్యోగులతో కలిసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మెకానికల్ ఫోర్ మెన్ దేవేందర్, టీఐ కృష్ణయ్య, కృష్ణయ్య, జేవీ స్వామి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నెలకొల్పిన గణపతి మండపాల్లో పూజలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండపాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెట్రోలింగ్ చేస్తున్నారు.

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను మంగళవారం సీఐ శివకుమార్ సందర్శించి, బీసీ కాలనీలోని వినాయక మండపంలో పూజలు నిర్వహించారని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మండపాల వద్ద అక్రమ విద్యుత్ కనెక్షన్లతో ప్రమాదాలు జరగవచ్చని, ట్రాన్స్‌కో అధికారులను సంప్రదించి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేటలో మంగళవారం వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మండపం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మానాజీపేటతో పాటుగా అప్పారెడ్డిపల్లిలోని ముదిరాజ్ సంఘం వినాయకుడి వద్ద గ్రామానికి చెందిన బాల్‌నాగయ్య దంపతులు అన్నదానం చేశారు. చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన గణనాథుడిని సోమవారం రాత్రి నిమజ్జనం చేశారు.

మహిళల సంక్షేమానికి కృషి

గోపాల్‌పేట: స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. గోపాల్‌పేట, రేవల్లి తహసీల్దార్ కార్యాలయాల్లో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల విద్యార్థుల యూనిఫాం కుట్టు బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. రేవల్లిలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీదేవి, పీఏసీఎస్ చైర్మన్ రఘు, ఉమ్మడి మండల ఇన్‌చార్జి సత్యశీలారెడ్డి, పర్వతాలు యాదవ్, కొంకి వెంకటేష్, శివన్న, నాగశేషి, చంద్రశేఖర్, వెంకటయ్య, శాంతయ్య పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పనిలో మహిళలకు ప్రాధాన్యమిస్తుందని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 44 మంది లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య, వెంకటేశ్వర్‌రావు, ఆగారం ప్రకాష్, క్యామ రాజు, సాయిచరణ్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, విజయలక్ష్మి, మల్లేష్, సతీష్, రాములు, కృష్ణయ్య, లక్ష్మారెడ్డి, శంకర్, శ్రీరాములు, నారాయణ, రవినాయక్, బాబు తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో కల్యాణలక్ష్మి పథకం చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతకు సన్మానం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పలుస శంకర్‌గౌడ్ ఇటీవల రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డును అందుకున్నాడు. మంగళవారం కంచిరావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సరస్వతి, ఉపాధ్యాయులు ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో అవార్డును అందుకున్న ఏకైక వ్యక్తి శంకర్‌గౌడ్ అని అన్నారు. మూడు దశాబ్దాలకు పైగా విద్యారంగానికి ఆయన చేస్తున్న సేవలను అమూల్యమైనవని వారు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ రెడ్డి, శ్రీదేవి, వెంకటేశ్వర్లు, రాజు, శ్రీనివాస్‌గౌడ్, రాజేష్, అనురాధ, బైరోజు చంద్రశేఖర్, భాస్కర్, శేఖర్, సాయిరేణు, కృష్ణవేణి, ఫాతిమా, శైలజ, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

అమరచింత: చేనేత కార్మికులు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. దీంతో పాటు పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట సీఎం, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిత్రాపటాలకు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు మహంకాళి విష్ణు మాట్లాడుతూ చేనేత రుణమాఫీ ద్వారా రూ.30 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని, అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిరుమలేష్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

ఆందోళనలు పక్కదారి పట్టించేందుకే ‘హైడ్రా’మా

వనపర్తిటౌన్: రైతుల నుంచి రుణమాఫీ ఆందోళనలు వెలుగులోకి రానివ్వకుండా పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ‘హైడ్రా’మాతో ప్రజల దృష్టి మళ్లిస్తుందని జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ గార్డెన్స్‌లో జిల్లా సభ్యత్వ ఇన్‌చార్జ్, జెడ్పీ మాజీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ప్రతి పోలింగ్ బూత్‌లో 200 సభ్యత్వాలు చేయించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలో 63వేల మంది బీజేపీకి ఓటు వేశారని, ప్రతి ఒక్క ఓటరు బీజేపీ ప్రాథమిక సభ్యత్వం కలిగి ఉండేలా బూత్ లెవల్, శక్తి కేంద్రం , ఆపై స్థాయి నాయకులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పదవులకు రాజీనామా చేయించకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి చేర్చుకుంటున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ రాజ్యాంగ పీఠికలను చేతిలో పట్టుకొని తిరిగితే సరిపోదని, రాజ్యాంగాన్ని అనుసరించి పార్టీలు మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించి ఎన్నికలకు వెళ్లే సత్తా రాహుల్‌కు, రేవంత్‌కు ఉందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్, వెంకట్‌రెడ్డి, పురుషోత్తం, శ్రీశైలం, రామన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కదిరె మధు, కుమారస్వామి, సీతారాములు, సుమిత్రమ్మ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

మృతదేహం లభ్యం

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణ శివారులోని సాయిబాబా ఆలయం వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సాయిబాబా ఆలయం వద్దకు వెళ్లి వృద్ధుడి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహం కాలుకు గాయం ఉన్నట్లు గుర్తించారు. అతడి వయస్సు దాదాపు 60 నుంచి 70 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. మృతదేహాన్ని వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే పెబ్బేరు పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

విద్యార్థులను సిద్ధం చేయాలి

కొత్తకోట రూరల్: నవంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు నిర్వహించే నేషనల్ అచ్యూమెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) 2024 పరీక్ష కోసం విద్యార్థులను సిద్ధం చేయాలని పెద్దమందడి ఎంఈఓ జయశంకర్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం న్యాస్ పరీక్ష పత్రాలను ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. పెద్దమందడి మండలంలోని వెల్టూర్, గట్లఖానాపూర్, చిలకటోనిపల్లి పాఠశాలలో జరుగుతున్న సంసిద్ధత పరీక్షలను పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ బి.విష్ణు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాతా

పాన్‌గల్: కలెక్టర్ ఆదేశానుసారం సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గోప్లాపూర్‌లో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం సీజనల్ వ్యాధుల నివారణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మంగళవారం కళాజాతా నిర్వహించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత, నిల్వ నీటిని వారానికి ఒక్కసారి పారబోయడం, దోమలు వృద్ధి చెందకుండా చూడడం, ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల్లోని పథకాలపై ఆట, పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ కుర్మయ్య, కళాజాత బృందం అధ్యక్షుడు కృష్ణయ్య, కళాజాతా బృందం సభ్యులు శివలింగం, శ్రీనివాసులు, నరసింహ, రాజు, సువర్ణ, రాధా, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కొత్తకోట రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేసిన ఘటన మంగళవారం మండలంలోని అప్పరాల శివారులో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో కొందరు పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో సీసీఎస్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేయగా.. కొందరు పారిపోవడంతో ఇద్దరు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.18,350 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు.